క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కల్లూరురూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని కల్లూరు ఎంపీడీఓ డి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నకోరుకొండిలో గల బీసీ హాస్టల్‌ను ఆయన పరిశీలించి రికార్డులను, ఆహార నిలవలను తనిఖీ చేశారు. అనంతరం సమస్యలపై విద్యార్థులతో మాట్లాడి.. వారితో కలిసి భోజనం చేశారు. హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. హాస్టల్ నిర్వహణ బాగా ఉందన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కొణిజర్ల: విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్ పేర్కొన్నారు. ఎంటెక్ చదువుతున్న చిన్నమునగాలకు చెందిన పాపగంటి నవ్య, లక్ష్మీపురానికి చెందిన పెద్దపొంగు నాగఅఖిలకు.. సరేష్ తలా రూ.10వేలు నగదు అందించారు. ఆ నగదును సోమవరం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు వీరభద్రరావు, జీవీ సూర్యప్రకాశరావులు బాలికల తల్లిదండ్రులకు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భాస్కర్‌రావు, జాన్, రఘు, ఉపేందర్‌రావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మధిర: మధిర రైతు సేవా సహకార సంఘం పరిధిలో యూరియా అమ్మకాల కోసం అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సహకార సంఘ సిబ్బందికి శుక్రవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ.. 22 గ్రామపంచాయతీలు ఆధారపడిన మధిర సొసైటీకి కేవలం 10టన్నులు యూరియా అందిస్తే.. రైతులకు ఎలా సరిపోతుందని, మేజర్ గ్రామాల్లో యూరియా అమ్మకపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మందా సైదులు, పాపినేని రామనరసయ్య రాము, పడకంటి మురళి, రాధాకృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని ఢీకొట్టిన కారు

బోనకల్: బోనకల్ ఆర్వోబీ సమీపాన ఆరేళ్ల బాలుడు మరీదు యశ్వంత్‌ను శుక్రవారం కారు ఢీకొట్టింది. ఈఘటనలో గాయపడిన బాలుడిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రహదారి మరమ్మతులు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామం వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వైరా – జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వాహనదారులు ఇబ్బందులకు గురవడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో సీపీఎం నాయకులు శనివారం తాటిపూడి గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో రాష్ట్రీయ రహదారికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, తూము సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొమరయ్య వర్ధంతి వేడుకలు

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడిన ధన్యజీవి మనుబోతుల కొమరయ్య అని జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, సింగరేణి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి సభలో కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరయ్య ఆశయ సాధన కోసం కార్మికులందరు కలిసి కట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ ఫిట్ సెక్రటరీ జి.నర్సింహారావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ఉపేంద్రాచారి, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వహణ సాగేదెలా..?

భారంగా మారిన రైతు వేదికల నిర్వహణ

- నిధులు అందించని ప్రభుత్వం
- జీతం నుంచే నిర్వహణ ఖర్చులు
- ఆవేదనలో ఏఈఓలు



ఖానాపురంలోని రైతు వేదిక

వైరారూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయానికి సంబంధించిన సమాచారాన్ని శాస్త్రవేత్తలు, అధికారుల ద్వారా రైతులకు చేరవేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. రైతు వేదికల్లో రైతులందరినీ ఒక దగ్గరికి చేర్చి ఆధునిక వ్యవసాయం, అపార పంటల సాగు, వెదజల్లు పద్ధతి, డ్రమ్ సీడర్, వ్యవసాయం సాగులో నూతన పద్ధతులు, పంటల సాగుపై అవగాహన, తెగుళ్లు, చీడ పురుగుల నివారణ తదితర విషయాలపై అధికారులు వేదికలో రైతులకు అవగాహన కల్పిస్తారు.

భారంగా మారిన నిర్వహణ..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 సంవత్సరంలో ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షలు వెచ్చించి భవన నిర్మాణాలను చేపట్టింది. ఆ తర్వాత రైతు వేదికల మెయింటెన్స్‌కు రూ.9 వేలు కేటాయిస్తున్నట్లు నిర్ణయించింది. ఇక అంతే ఆనాటి నుంచి ఈనాటి ప్రభుత్వం వరకు మెయింటెన్స్‌కు ఒక్కరూపాయి కూడా ఏ ప్రభుత్వం అందించలేదు. దీంతో వ్యవసాయ మండల విస్తరణ శాఖ అధికారులు (ఏఈఓ)లు తమ జీతం నుంచే రైతు వేదికల నిర్వాహణ కొనసాగించాల్సి వస్తుంది. దాంతో ఏఈఓలకు రైతు వేదికల నిర్వాహణ భారంగా మారింది.

మండలంలోని వివరాలిలా..

వైరా మండలంలో మొత్తం 22గ్రామ పంచాయతీలు ఉండగా మరో 3 శివారు గ్రామాలు ఉన్నాయి. గత కొన్నేళ్ల కిందట ఆయా గ్రామాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ పరిధిలో 5 క్లస్టర్లుగా విభజించారు. ఆ తర్వాత 2022వ ఏడాదిలో వైరా, ఖానాపురం, కొండకొడిమ, గొల్లపూడి, విప్పలమడక గ్రామాల్లో ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షలు వెచ్చించి ఆయా క్లస్టర్లలో రైతు వేదికల నిర్మాణం చేపట్టారు.

బిజీ బిజీగా ఏఈఓలు..

క్లస్టర్‌కు ఒక ఏఈఓ ఉండగా.. వారి కింద సుమారు 4 నుండి 6 గ్రామ పంచాయతీలు ఉంటాయి. అయతే ఏఈఓలు తమ పరిధిలోని రైతులు ఏ పంటలు వేశారు, దిగుబడి, నష్టం తదితర వాటి మీద ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ వివరాలు సేకరించడంతో పాటు వ్యవసాయ మెళకులపై రైతులకు అవగాహన, క్రాప్ బుకింగ్, రైతు భరోసా, రైతు భీమా, పంటనష్టం సర్వే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు చేరవేయడంతో నిత్యం బిజీబిజీగా ఉండే వారికి రైతు వేదికల నిర్వాహణ భారంగా మారింది. ఇకనైనా ప్రభుత్వం రైతు వేదికల నిర్వాహణ కోసం నిధుల కేటాయించి భారం తగ్గించాలని ఏఈఓలు కోరుతున్నారు.

ఖర్చు వివరాలు..

ఒక్కో రైతు వేదిక నిర్వహణకు నెలకు రూ.8 వేల నుంచి 9వేల వరకు ఖర్చు వస్తుంది. అందులో రైతు వేదిక స్వీపర్‌కు నెలకు రూ.3,000, తాగు నీరు ఛార్జ్ రూ.600, స్టేషనరీకి రూ.1,400, ప్రతి మంగళవారం రైతు సమావేశాల కోసం రూ.2,000, ఏడాదికి ఫెక్సీ ఖర్చులు రూ. 3,500, మంత్రుల ప్రత్యేక సమావేశం జరిగే సమయంలో అదనంగా మరో రూ. 5,000 ఖర్చు అవుతుంది. ఇలా రైతు వేదికల నిర్వహణ కోసం వైరా మండలంలోని ఒక్కో ఏఈఓకు ఏటా సుమారుగా రూ.96,000 ఖర్చు వస్తుంది.

రైతు సదస్సును విజయవంతం చేయాలి



కొణిజర్ల: మాట్లాడుతున్న రమేష్

చింతకాని/కొణిజర్ల: ఖమ్మంలోని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యాలయంలో ఈ నెల 10న నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, కిసాన్ సంయుక్త మోర్చా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులపై అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో శుక్రవారం ఆందోళన నిర్వహించి వ్యవసాయ విస్తర్ణాధికారికి వినతిపత్రాన్ని అందించారు. కొణిజర్లలోని దొడపాటి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం పత్తి దిగుమతిపై ఉన్న 11శాతం సుంకాన్ని రద్దు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మన దేశంలో పత్తి మార్కెట్లోకి వచ్చేనాటికి విదేశీ పత్తిని దిగుమతి చేసుకోవటం వలన ధరలు పడిపోయి పత్తి రైతులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం దిగుమతి సుంకాన్ని రద్దు చేయటంతో పత్తి రైతులు దివాలా తీసి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందని తెలిపారు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతు ధర రూ.10 వేలకు పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ ప్రయోజనాల కోసం నిర్వహించనున్న సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తోటకూరి పుల్లారావు, అంబటి మల్లికార్జున్, తాత వెంకటి, నారపోగు వెంకటేశ్వర్లు, వంకాయలపాటి అప్పారావు, సుమన్, సోమయ్య, సీతారాములు, వెంకయ్య, వెంకటేశ్వర్లు, శంకరావు, రామారావు, గిరి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆటోడ్రైవర్ మృతి

కారేపల్లి: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కారేపల్లి పాత పోస్టాఫీస్ సెంటర్‌కు చెందిన ఆటోడ్రైవర్ తురక సర్వేశ్వరరావు(35) శుక్రవారం మృతి చెందారు. కాగా, కారేపల్లి ఆటోయూనియన్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం వ్యక్తం చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు ఎస్సీసెల్ మండలఅధ్యక్షుడు మేదరి టోనీవీరప్రతాప్ మృతుడి కుటుంబసభ్యులకు రూ.5వేలు అందించి, నివాళులర్పించారు. వీరితో పాటు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, బీఆర్‌ఎస్ నాయకులు గౌసుద్దీన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ నాగవెళ్లి ప్రభాకర్, దుండి సైదులు, రాము, సతీష్ తదితరులు ఉన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

జీఎస్టీ తగ్గింపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట లభించిందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నంబూరి రామలింగేశ్వరరావు



ఎర్రుపాలెంలో..



బోనకల్‌లో..

శిథిలమవుతున్న సివిల్ సప్లయీస్ గోదాం

కల్లూరురూరల్: కల్లూరులోని పౌరసరఫరాల శాఖ గోదాంకు మరమ్మతులు లేక శిథిలమవుతోంది. ఈ గోదాంకు మరమ్మతులు అవసరం కావడంతో గత ఏడాది బియ్యాన్ని వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని గోదాంకు తరలించారు. అక్కడి నుంచే రేషన్‌షాపులకు బియ్యం సరఫరా అవుతోంది. కానీ కల్లూరు క్రాస్‌లోని గోదాం మరమ్మతులపై జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చినా నిధులు మంజూరు కాలేదు. దీన్ని మరమ్మతు చేస్తే మరో పదిహేనేళ్ల ఉపయోగపడే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. దీనికి తోడు వ్యవసాయ మార్కెట్ గోదాంకు నెలనెలా రూ.6వేల అద్దె చెల్లిస్తుండడం గమనార్హం.



ఇసుక డంప్‌కు అడ్డాగా మారిన గోదాం ఆవరణ

ప్రెస్‌క్లబ్ కమిటీకి సన్మానం



ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

మధిర: మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన పాగి బాలస్వామి, చెరుకూరి వినోద్, కోశాధికారి పల్లపోతు ప్రసాదరావు తదితరులను మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం సన్మానించారు. అలాగే, మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేయగా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డితో పాటు లింగంపల్లి అప్పారావు, ఆదూరి అబ్రహం, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, కోటేశ్వరరావు, రాజేశ్వరి, కంచిపోగు ఆదాం, గద్దల కోటయ్య, కొండూరు ఎలమందరావు, షేక్ జానీ, రెహమాన్, ఊటుకూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం..




పవన్‌కుమార్

ఏన్కూరు: యువజన కాంగ్రెస్ ఖమ్మం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఏన్కూరు మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన చిన్నం పవన్‌కుమార్‌రాజు ఎన్నికయ్యారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై సోషల్ మీడియా వేదికగా ప్రజలకు అవగాహణ కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ధార్మిక సభను విజయవంతం చేయాలి

బోనకల్: ఈనెల 20న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రవక్త మహమ్మద్ జీవిత సందేశంపై నిర్వహించనున్న ధార్మిక సభను విజయవంతం చేయాలని ముస్లిం ఐక్య సంఘం మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా తెలిపారు. బోనకల్ మసీదులో శుక్రవారం సభ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ధార్మిక సభకు ముఖ్య అతిథిగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాంపూర్ ఎంపీ మౌలానా ముహిబుల్లా సాహెబ్ నద్వి, పంజాబ్ హజరత్ మౌలానా మహమ్మద్ ఉస్మాన్ సాహెబ్, రహ్మాని లుధియాన్వి హాజరవుతున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులు సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మౌలాలి, మజీద్ కమిటీ సభ్యులు దస్తగిరి, మత పెద్దలు హుస్సేన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును..



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడు సీతారామయ్య

సత్తుపల్లిరూరల్: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీం వర్కర్ల సమస్యలపై ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో శుక్రవారం రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి రాఘవులు, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, విక్రం, క్రాంతి, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం



వైరా: గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



సత్తుపల్లి: సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చింతకాని: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వైరా/కొణిజర్ల: వైరా, కొణిజర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం కొణిజర్లలోని తుమ్మలపల్లికి చెందిన నిరుపేద బాలికకు రూ.6 వేలు విలువ గల సైకిల్‌ను వితరణ చేశారు. అదే విధంగా వైరాలో, పల్లిపాడులోని కార్తీక్ విద్యాలయంలో ఉపాధ్యాయ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు నాగేశ్వరరావు, అప్పారావు, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను సత్తుపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలు, కళాశాలల్లో స్వయంపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

చింతకాని/బోనకల్: చింతకాని మండలంలోని నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉపాధ్యాయులను సన్మానించారు. అదే విధంగా నేరడ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావును, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, లక్ష్మీనరసింహారావు, పందిళ్లపల్లి ఉపాధ్యాయుడు తీర్థాల మహేష్, మత్కేపల్లి ఉపాధ్యాయుడు నాగమణి, బోనకల్‌లోని.. గోవిందాపురం ఉపాధ్యాయుడు ఇమ్మడిశెట్టి నారాయణరావు లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.అదే విధంగా బోనకల్‌లోని.. స్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయులు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేకాధికారి సక్కుబాయి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజేశ్వరరావు, మంగపతిరావు, గౌరవ సలహాదారులు వెంకటరాజ కృష్ణారావు, సూర్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, కోశాధికారి దుర్గా శంకర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



బోనకల్: కేజీబీవీలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

కల్లూరురూరల్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కల్లూరు మండలం నుంచి ఎంపికైన హెచ్‌ఎం ఎం.శిరీషను శుక్రవారం పలువురు సన్మానించారు. గోపాలదేవుని బోయినపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు ఆమెను అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గి స్కూల్ మూతపడే సమయాన స్కూల్‌కు వచ్చిన శిరీష గ్రామస్తుల సహకారంతో ఇంటింటికీ తిరిగి విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేశారని వెల్లడించారు. అలాగే, మండలం నుంచి శిరీషతో పాటు చండ్రుపట్ల, వెన్నవల్లి స్కూళ్ల హెచ్‌ఎంలు బి.శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు ఎం.రోజా, ఎస్.కే.అబ్దుల్ రహీం, బి.రామానందం, డి.సాంబశివరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, ఎస్.వీ.నాగమణి, టి.కృష్ణవేణి కూడా ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికయ్యారని ఎంఈఓ పి.నివేదిత తెలిపారు.



శిరీషను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

వైరా: వైరాలో శనివారం నిర్వహించే గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను వైరా మున్సిపల్ కమిషనర్ యు.గురులింగం, వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్ శుక్రవారం పరిశీలించారు. గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే సోమవరం నల్లచెరువును పరిశీలించి, ఏర్పాటు చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. విగ్రహాలతో వాహనాలు వచ్చి తిరిగి వెళ్లడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారి సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరగడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పుష్పాల రామారావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైరా నల్లచెరువు వద్ద పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్

ప్రత్యేక పూజలు.. నిమజ్జనం



మధిర: తహసీల్దార్ రాంబాబు దంపతులను సన్మానిస్తున్న యూత్



సత్తుపల్లి: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్



తల్లాడ: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



సత్తుపల్లిటౌన్: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ రఘు

మధిర: మధిర మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద శివాలయం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి శుక్రవారం మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా.. యూత్ సభ్యులు తహసీల్దార్ దంపతులను సన్మానించారు.

తల్లాడ: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం, కృష్ణ మందిరం కమిటీ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయకుడికి పురవీధుల్లో ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు.

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి బైపాస్‌రోడ్‌లో గణనాథుడికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాము, చెన్నారావు, కమల్‌పాషా, కోటేశ్వరరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో వాసవీగణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన మహా అన్నదానం విజయవంతమైంది. ఈ కార్యక్రమాన్ని ఏసీపీ ఎ.రఘు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, సీఐ శ్రీహరి ప్రారంభించారు. ఉత్సవ కమిటీ నిర్వహకులు సత్యనారాయణ, శ్రీధర్, జగదీష్, శివకుమార్, ఉమా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏన్కూరు: స్థానిక కమ్మవారి కల్యాణమండపం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మేళతాలలో గణపతిని ఊరేగించి.. తూతకలింగన్నపేట సమీపంలో సాగర్‌కాల్వలో నిమజ్జనం చేశారు.